ద్వితీయం

కొడవటిగంటి కృష్ణమూర్తిగారు

అతనికి బుద్ధితెలిసినతరువాత ముప్పైసంవత్సరాలకాలంలో రంగారావు ఒక్కనాడైనా మనోవ్యాధి ఎరగడు. వారి సంసారంలో గృహచ్ఛిద్రాలు, అకాలమరణాలు, దారిద్ర్యంమొదలయినవి ఎన్నడూ అడుగు పెట్టలేదు. నేటికా అనుభవ మీతనికి లభ్యమయింది.

రంగారావు తండ్రిగారు చాలాధనం సంపాదించి గతించాడు. రంగారావెక్కువచదువుకోలేదు. స్కూలుతరగతులతో అతని విద్యాభ్యాస మంతమయిపోయింది. అతను చాలాసౌమ్యుడు. అందరికీ అతన్ని చూస్తే గౌరవం, అభిమానం. అతని ఇరవైయోసంవత్సరంలో మొదటిభార్య కాపరానికివచ్చింది. ఆమె పన్నెండుసంవత్సరాలు కాపరంచేసి గతించింది. ఆమెగతించేసమయానికి అయిదారుసంవత్సరాల కుమారుడొకడున్నాడు.

ద్వితీయం పనికిరాదని పట్టుదలలేకపోయినప్పటికీ రంగారావు తిరిగి వివాహంచేసుకున్న దీపుత్రుడి కొరకే. వివాహమయి మూడుసంవత్సరాలయింది. భార్య బహురూపవతి. వివాహమయినప్పటినుంచీ రంగారావుమనస్సు శాంతిఅన్నమాట ఎరగదు.

వివాహమయినమర్నాడు' రంగారావుకు మనోవ్యాధి ప్రారంభమయింది. అతను పూర్వ మనేకమంది చక్కని స్త్రీలనుచూచాడు. కాని తనకు అందగత్తెభార్యగా రావాలని అతను ఎప్పుడూ కోరలేదు. చక్కని వాళ్ళనుచూస్తే అతనికొకవిధమైనభయం, అనుమానం.

రంగారావుభార్య చాలాచక్కనిది. తనమామగారు వివాహానికి పూర్వంతనకుమార్తె చక్కనిదని చెప్పినప్పుడు రంగారావు ఎక్కువచెవినిబెట్టుకోలేదు.

"ఈభార్యతో నేను స్వతంత్రంగా మాట్లాడగలనా? మాయిద్దరికీ అసలు మనస్సుకలుస్తుందా? ఇద్దరం చెరొకమూలా ఉన్నట్టున్నాం! అసలు ఇలాటివాళ్ళు అదొకరకంగా ఉంటారు!" రంగారావుశరీరం జలదరించింది. జారత్వంఅనేది అతని ఆలోచనల్లోకి పూర్వం ఎన్నడూరాలేదు! అటువంటిది తనజీవితంలోవస్తుందేమో!

రంగారావు ద్వితీయవివాహమయిన ఆరునెలలకు తనకుమారుడు అకారణంగా మరణించాడు. నలుగురూ చేరి పెళ్ళిఅయినవేళావిశేషమన్నారు. అంతటితో రంగారావుకు భార్యమీద అసహ్యంకూడా కలిగింది. కాని అతని అసహ్యం ఎన్నడూ ఇతర్లను బాధించదు!

వివాహమయిన రెండుసంవత్సరాలకు రంగారావు బలవంతంగా భార్యను తెచ్చుకున్నాడు. ఒకమనిషి మనసామీప్యంలో ఉన్నప్పుడు మన కామనిషిమీద ఉండే అభిప్రాయానికి, దూరంగాఉన్నప్పటి అభిప్రాయానికి ఎంతోభేదం ఉంటుంది.

ఒకవారంరోజులు లీలావతి ఇంట్లోతిరిగినతరువాత రంగారావు మనస్సంతా పరగవాయింది. ఆమెను చూచి భయపడ్డందు కతను నవ్వుకున్నాడు. లీలావతి చాలాసౌమ్యంగా ఉండేది—తనమాదిరిగానే చక్కని వారంతా ఒకరకంగాఉంటారని ఊహించుకున్నాడు రంగారావు. లీలావతి ఆవిధంగాకూడా లేదు.

లీలావతికి ఇరవైనాలుగ్గంటలు అలంకరించుకోటంతో సరిపోతుందనుకున్నాడు. కాని ఆమె బీదఇంటి నించి రావటంచేత ఎప్పుడూ ఏదోచాకిరిచేస్తూండేది. అంతవరకూ బాగా నేఉన్నది. కాని రంగారావు మనో వ్యాధి తీరలేదు.

అతని కిప్పుడు భార్యనుచూస్తే జాలిఎక్కువయింది. అంతచక్కనిపిల్ల పాపం తండ్రిబీదరికంచేతకద తనకన్న ఇరవైసంవత్సరాలు పెద్దఅయినభర్తతో సంసారంచేయవలిసి రావటం! లేకపోతే బాగాయౌవనంలో

ఉన్న భర్తతో సుఖపడేదా! యౌవనంలో ఉన్న భర్త తనమాదిరిగా ఆమెకంతఎడంగా ఉన్నట్టుంటాడా? రంగారావు ఆమెకు ఎక్కువసుఖంకలిగేటట్టు నౌకర్లనుపెట్టి పనిచేయించవచ్చును. కాని తనముఖంచూస్తూ కూర్చోటంకన్న ఏదో పనిలోమునిగిఉండటం ఆమె కెక్కువసుఖంకాదా? పాపం మొదట్లో ఆమె నెంత అసహ్యించుకొన్నాడు రంగారావు? ఎందుకు? ఆమెకు తనయింట సుఖంలేనట్టు సులభంగాకనిపెట్టవచ్చును! ఆమెముఖాన చిరునవ్వుకాని, సంతోషంకాని అతడెన్నడూ చూడలేదు.

స్త్రీమనస్సునుగురించి తనకేమీ తెలియదు. కొందరుస్త్రీలు నగలతో ఎక్కువతృప్తిపడతారట, కొందరు భర్త స్వేచ్ఛగామాట్లాడితే సంతోషిస్తారట. ఈవిధంగా నలుగురూ అనుకుంటుంటే విన్నాడు రంగారావు. లీలావతిముఖానికి చిరునవ్వుతెప్పించట మెలాగాఅని అతనికి ఆలోచనపట్టింది.

లీలావతి వచ్చినప్పటినుంచీ అతని మనసులో పూర్వమెన్నడూలేని వికారంకలిగింది. కొంతకాలమతని కాసంగతి తెలీలేదు, తరువాత అర్థంకాలేదు. ఒకరోజున అకస్మాత్తుగాతట్టింది. అతను లీలావతిని విపరీతంగా ప్రేమించాడు. ఇది చాలామందికి విచిత్రంగాఉంటుంది. పదపన్నెండుసంవత్సరాలు స్త్రీసంపర్కంఉండి ప్రేమఅంటే ఏమిటో తెలియకపోవటం చాలావిచిత్రంగా ఉంటుంది. ప్రేమను సంసారసుఖానికి బాహ్యమైన దాన్నిగా తీసుకుంటే ఇది అర్థమవుతుంది. సుఖంలోలేవాడికి చక్కనిస్త్రీ కనిపించగానే ఆస్త్రీమీద తాత్కాలికంగా మోజుఏర్పడుతుంది. కాని ఆమోజుఎంతోకాలము ఉండదు. ఆస్త్రీకి నీచమైనఅభ్యాసాలుండవచ్చును. అవి బయటపడగానే మోజుకూడా బయటికినడుస్తుంది.

రంగారావుకు ప్రేమ అభిమానపూర్వకంగా ప్రారంభమయింది. క్రమంగా లీలావతి ప్రకృతి అతనికర్థమవుతున్నకొద్దీ ఆఅభిమానం ప్రేమగామారింది. ఈఅభిమానం బయటికిరావటానికి రెండే అభ్యంతరాలు.

మొదటిది అతనిదగ్గరవారిలో అతనికిష్టులెవ్వరూలేరు. అనగా అతని అభిమానానికి ప్రేమపాత్రులైనవారెవ్వరూలేరు. అందుచేత అతనికి తనఇష్టులతో కలిసిమెలిసి ఉండటం స్వేచ్ఛగా తనఅభిమానాన్ని వెల్లడిచెయ్యటం అతనికి చాలాకొత్త. లీలావతిమీద తనకున్నప్రేమ ఏవిధంగాచూపించాలో అతనికి తెలియదు. ఆమెతో ఇష్టంగా మాట్లాడ్డానికూడా అతనికి సిగ్గుగాఉన్నది. పూర్వం భార్యతో అతను అందరితో మాట్లాడినట్టు మాట్లాడేవాడు నిస్సంకోచంగా. లీలావతి అందరితోపాటుకాదిప్పుడు తనకు. పైగా రంగారావు చొరవగలవాడుకాడు; తనలోతనకు నమ్మకంతక్కువ.

రెండోది లీలావతిమనసు అతనికేమీ తెలియదు. ఆమెనడగటానికి ధైర్యంలేదు. అతనికింకొకరిమనసు కనిపెట్టడంచేతకాదు అభ్యాసంలేకపోవటంచేత.

రంగారావు చాలాకాలమీదీనస్థితిలోఉన్నాడు. భార్యతో సాధారణవిషయాలన్నీ సహజంగామాట్లాడినవాడు తనమనస్సు తెలిసేటట్టు ఒక్కమాటఅనబోతే గొంతుపట్టుకొనేది.

బైట పడలేకపోవటంచేత రంగారావుప్రేమ నీటిలో మడ్డిమాదిరిగా తేరుకోడంప్రారంభించింది. పైకి చూడటానికి లేనట్టేఅయిపోయింది. కాని చిన్నరాయిపడితే తిరిగి పైకివచ్చేస్థితిలోఉన్నది. ఆరాయి వెయ్యటం రంగారావుచేతకాదు. లీలావతి వెయ్యలేదు!...వ్యవహారం దైవంచేతుల్లోకి పోయింది.

రంగారావుకు జీవితంమీద విరక్తికలిగింది. మొదటిభార్యచనిపోయినప్పుడు జీవితాన్ని ఉత్తమమార్గానికి తిప్పటానికి తనకు చాలా మంచిఅవకాశం కలిగింది. అది పోగొట్టుకొని తిరిగి మొదట్లోకివచ్చాడు. తన చిన్నతనంలో ఎవరైనారెండోపెళ్ళి చేసుకుంటే చాలానీచంగా చూచేవాడు. "ఈయన కింకా ఏమిసంసారకాంక్ష"అనుకునేవాడు. రంగారావు ఏకారణంచేత వివాహంచేసుకున్నప్పటికీ సంసారకాంక్షకారణం మాత్రం కాదు. అతని కది మొదటినుంచీ ఎక్కువలేదు.

ఈవివాహం ఎవరికోసంచేసుకున్నట్టు? తనకు నిజంగా భార్య అవసరంకాదు. తనకుమారుడు గతించాడు. తనభార్య లీలావతికా? అతను ఊహించగలిగినంతవరకు అమెకు ఏవిధమైన సంతోషంఉండదు. కొంత పాతపడ్డతరువాత లీలావతి తనతో స్వేచ్ఛగా మాట్లాడుతుందేమోనని మొదట్లో ఆశపడ్డాడు. ఆఆశ తీరింది. అసలామె స్వభావం అంతేనేమో అనుకున్నాడు. ఆఅనుమానంతీరింది. ఆమె అప్పుడప్పుడు తనను చూడడానికివచ్చిన బంధువులతో చాలా స్వేచ్ఛగా, సరదాగా మాట్లాడుతూఉండేది.

తనతో అట్లామాట్లాడనందుకు రంగారావుకు లీలమీద కోపంరాలేదు. అతనికి ఎవరిమీదా ఎక్కువ కోపంవచ్చేదికాదు. తనతో మాట్లాడలేదంటే ఆమెలోపం ఏమీలేదు. తనకు ఆమెకన్న పెద్దకుమార్తె ఉండవచ్చును. ఆమూడుముళ్లు పడ్డందుకు లీల భర్తకు సకలమైన చాకిరీచేస్తూండేది. నిజానికామె మనస్సుమీద తనకేమి అధికారంఉన్నది?

ఆమెను వివాహంచేసుకున్నందుకు తన్నుక్షమించమని ఆమెను వేడుకుందామనుకున్నాడు. కాని ఆమె యెదట ఆమాటలు పైకివచ్చేవికావు. రంగారావుమనస్సులో పెద్దతుపాను రేగుతున్నది. దానికి కారణమతనే చెప్పలేడు. ఒకవేళ చెప్పినా అందరూ "ఎక్కడో చిన్నపిల్లాడిలాగున్నావు" అని నవ్వుతారు. కాని సానుభూతిరాదు.

"ఇప్పుడు మాఅమ్మఉంటే ఎంతబాగుండును!" అనుకున్నాడు రంగారావు. తనకుతాను చిన్నపిల్లవాడైపోయినాడు. ఇంకోరంటూరంటే చిత్రమేముంది? లీలమాత్రం ఒక్కక్షణం భర్తవిషయం ఏమరుపాటుగా ఉండేదికాదు.

"పాపం! నన్నుచూస్తే భయంకాబోలు! అశ్రద్ధగాఉంటే చంపేస్తానని! పాపం, ఆమెకు నేనంత భయంకరంగా–మోటగా కనపడుతూండాలి?" అనుకునేవాడు రంగారావు. పూర్వం తన మొదటిభార్య ఉన్నప్పుడు రంగారావుకెంతో ఇంటిపనిఉండేది. ఇప్పుడతనికి వేరేఏమీ పనిలేదు. ఉద్యోగంలేనిభర్తను చూస్తే భార్యకెంతఅలుసు! లీల కాఅలుసైనా లేదేం?

రంగారావుకు ఏదైనా వ్యావృత్తి కలిపించుకుంటేతప్ప కాలంగడిచేటట్టులేదు: పిచ్చికూడాఎత్తుతుందనిపించింది. అయిదారుసంవత్సరాలక్రిందటివరకు రంగారావు గానకళ, చిత్రకళ మొదలైనవాటిల్లో ఎక్కువ పరిశ్రమచేస్తూండేవాడు. అతనిభార్య తనకు ఈకళలనుగురించి ఎమీ తెలియదనీ, తనకు వాటియందభిరుచి లేదనీ చెప్పుతూండేది. తరువాత రంగారావుకూడా అట్లాగేఅనిపించింది. అయిదారేళ్ళనుంచీ వాటిధోరణే లేదు. రంగారావెక్కడో పెట్టెలోపెట్టినఫిడేలుతీసి శ్రుతిచేసివాయించబోతే ఏమీ ఉత్సాహంలేకబోయింది; బలవంతాన ఒక అరగంటసేపువాయించి ఒకమూల పారేశాడు.

ఈసమయానికి చిన్నచిత్రంజరిగింది. చిన్నచిన్నవిషయాలు మనజీవితానికి ఎంత ప్రాముఖ్యత తెచ్చునో విచారిస్తే ఆశ్చర్యంకలుగుతుంది.

ఒకరోజు చీకటిపడ్డతరువాత రంగారావు ఇంటికివచ్చాడు. వంటింట్లో లీలావతి వంటచేస్తూ ఎవరితోనో మాట్లాడుతున్నది. గొంతతనికి పరిచయమైనదికాదు. ఎవరైనా స్నేహితురాలో, బంధువో లీల కనుకున్నాడు. అతనిగదిలోకి వారిమాటలు స్పష్టంగావినబడుతున్నాయి. లీలగొంతులోఉన్న ఉత్సాహంపట్టి తనరాకడ వారు వినలేదని రంగారావు గ్రహించాడు.

"మావారంతా కులాసాగాఉన్నారా? జానకీ!" అన్నది లీల. సంభాషణ ఇంకా మొదట్లోనేఉన్నది. రంగారావు కామాట వినబడేసరికి మనస్సు కరిగిపోయింది. పాపం, లీల తనవారికోసరం కలవరి[illegible]

కాబోలు! సంభాషణ పెద్దగొంతులతోనే జరిగిపోతూంది. కాని రంగారావు సంభాషణవిషయం కట్టిపెట్టి ఏదో పనిచూచుకోటం మొదలుపెట్టాడు. వారి సందడిమాత్ర మతని చెవిని అర్థంలేకుండా పడుతున్నది. ఈ విధంగా అయిదారునిమిషాలు జరిగింది.

జానకి అనేమనిషిగొంతు అకస్మాత్తుగా చిన్నస్థాయికి వచ్చింది. రంగారావు చెవులూ అప్రయత్నంగా బాగా తెరుచుకున్నాయి. రంగారావుకు వింటున్నాననే తెలియదు!

"సరేకాని, పిల్లా! మీనాన్న ఏమన్నాడో తెలుసునా? ..పాపం! మీఅమ్మానాన్న ఎంతదిగులుపడుతున్నారో నీకోసం...మీఅమ్మ నిన్నువదలి ఉండలేదు! మీనాన్నకు వేరేదిగులు. మీఅన్నా మీనాన్నా చేరి నీపెళ్ళివిషయం ఎంతఎరతఉపన్యాసాలు! నువ్వనమ్మవే లీలా! మీఅన్న నిన్ను రెండోపెళ్ళివాడికెందుకివ్వాలని! మీనాన్నేమో బుద్ధిలేక ఇచ్చాననీ!..."

జానకిపని అయిపోయింది. మౌనం వహించి ఉన్న లీలదగ్గిర జానకి శలవు తీసుకొని వెళ్ళిపోయింది.— మళ్ళీ మర్నాడు వస్తానని వాగ్దత్తం చేస్తూ.

రంగారావు దీర్ఘంగా నిట్టూర్పు చ్చాడు. ఈమాట లతని మనసెందుకు బాధించాలో తెలియలేదు. తన మామగారూ, బావమరిదీ కలిసి ఇచ్చిన ఉపన్యాసాలు తనకు తానెన్నిసార్లో ఇచ్చుకున్నాడు. అప్పుడు తన మనస్సు చాలా నిర్మలంగా ఉండేది. తను చేసిన పని చెడ్డదైనప్పుడు అందరూ ఎందుకనరు? పాపం, లీల! తన తండ్రి ఆమాటలన్న సంగతి విన్నతరవాత ఆమెగొంతు వినిపించలేదు. ఆమెకు మాత్రం తెలియదా?

ఏపాపానికైనా ప్రతిక్రియ ఉన్నది! దీనికి కనుపించలేదు! 'రంగారావు తానీమాటలు విననట్టు నటించాడు. ఆరాత్రి భోజనం చేసేటప్పుడు లీల చాలభయపడ్డదానిమాదిరిగా కనిపించింది. ఆమె అంతగోలపడుతుందని రంగారావు వూహించలేదు. కాని ఆమె శ్రద్ధ విషయమయి మామూలుకన్న ఎక్కువగా ఉన్నది. నెయ్యి వేసేసమయంలో లీల చేయి వణికింది.

"చూడు!" అన్నాడు రంగారావు అకస్మాత్తుగా. లీల ఆగింది. "నన్ను చూచి ఎందుకట్లా భయపడుతావు! ఆ! నాకన్నీ చేతనవును కాని భయపెట్టడం చేతకాదు. నన్ను చూచి ఇంతవరకెవ్వరూ జడవలేదు!"

లీల తలవంచుకొని మెల్లిగా వెళ్ళిపోయింది. మళ్ళీ వచ్చినప్పుడు రంగారావు "ఎవరిప్పుడు వచ్చిన మనిషి?" అన్నాడు.

"మావాళ్ళ ఊరే! నా స్నేహితురాలు!" అన్నది లీల.

"అంతా కులాసాగా ఉన్నారా?"

"ఆ!"

"ఊరికే చూడటానికా వచ్చింది?"

లీల కొంచంతటపటాయించింది. "మానాన్న రెండుమూడు రోజుల్లో వస్తాడని చెప్పింది!" అన్నది లీల.

"ఉహూ!" అన్నాడు రంగారావు పరధ్యానంగా.

ఇంతలో ఏదో పండగయింది. జానకి వచ్చిన మర్నాడే రంగారావు మామగారి వద్దనుంచి ఉత్తరం వచ్చింది. ఆయన కుమార్తెనూ, అల్లుణ్ణి పండగకు తీసుకొనిపోవటానికి వస్తున్నట్టు.

తనమామగారన్న మాటలు వెంటనే రంగారావు మరిచిపోయినాడు. ఆయన రాక అతనికి చాలా సంతోషంగా ఉన్నది. మొదటి విశేషం లీల కొంతకాలం పుట్టింట సుఖంగా ఉంటుంది. తరువాత తనకు లీలబరువు కొంతకాలం వదలుతుంది. ఆమె ఉండగా అతనికి స్వేచ్ఛ లభించేటట్టు లేదు.

సరిగా సమయానికి మామగారువచ్చాడు. రంగారా వాయనతో చాలామర్యాదగామాట్లాడాడు; లీలనుపంపటం తనకేమీ అభ్యంతరంలేదన్నాడు. తనకుమాత్రం కొంచంపనిఉందన్నాడు. నీకూ, నాకూ పని కూడానా అనుకున్నాడు మామగారు.

"నువ్వుకూడా రావలని నాకోరిక!" అన్నాడుమామగారు పైకి.

"ఈసారికి వీలులేకుండావచ్చింది. ఏబండికిపోతే వీలుగాఉంటుంది?" అన్నాడురంగారావు.

"త్వరగాభోజనాలయితే పన్నెండుగంటలబండి!"

అంతటితో సంభాషణచాలించి మామగారు కుమార్తెనుచూడపోయినాడు. రంగారావు తనపనిచేసు కుంటూ కూర్చున్నాడు. అయిదునిమిషాలయినతర్వాత రంగారావు తనమామగారు అతివేగంగా తనగది ప్రక్కగా వెళ్ళిపోవటంచూచాడు. అతనికాశ్చర్యంగలిగింది. అప్పుడే పదకొండుగంటలు కావస్తున్నది. మళ్ళీ ఈయనెక్కడికిపోతున్నాడు?

రంగారావు వంటచేస్తూన్న లీలదగ్గిరికివెళ్ళాడు.

"మీనాన్న ఎక్కడికిపోతున్నాడు?"

"ఊరికి కాబోలు"

"ఊరికా? ఏఊరూ? నిన్నుతీసుకొని పోతానన్నాడే?"

"నేను రానన్నాను."

"ఏం?"

"నాకిష్టంలేదు."

రంగారావు కొంచమాలోచించాడు.

"అయితేమాత్రం భోంచేసిపోగూడదూ?"

"ఆయనకు కోపంవచ్చింది."

"ఎందువల్ల?"

లీలమాట్లాడలేదు.

"ఎవరిమీద?"

"నామీదనే!"

"ఎందుకని?"

లీలమాట్లాడలేదు.

"పాపం ఆయనకెందుకు కోపంతెప్పించావు? నాకు ఇంకోరికి కోపంవస్తే కష్టంగాఉంటుంది."

లీల తలఎత్తిచూచింది.

"పోనివ్వండి. ఆయనమంచివాడైతే నేను కోపంఎందుకు తెప్పిస్తాను?"

రంగారావుకు అర్థంకాని తృప్తివకటివచ్చింది మనస్సులో. అప్పటి క్కావిషయం అయిపోయింది. తిరిగి అతను భోజనంచేస్తుండగా నిజంతట్టింది. అకస్మాత్తుగా నేలగుద్ది "చూడు" అన్నాడు. అట్లాగ్నేలెండి అతను భార్యను పిలవటం. లీల నిలబడ్డది.

"మీనాన్న నేమన్నావు?" అన్నాడు రంగారావు.

"నాముఖం చూడవద్దన్నాను."

"ఎందుకని?"

లీల అనుమానించింది.

"చెప్పవూ?"అన్నాడు రంగారావు దీనంగా.

లీల రంగారావువంక సంతోషంతో చూచింది. అత నంతవర కామెతో ఆమాత్రం స్వేచ్ఛగామాట్లాడి ఎరగడు.

"ఎందుకు పోనియ్యండి! ఆయనదగ్గరకొన్ని పాడుగుణాలున్నయ్యి."

"ఏం చేశాడేం?"

లీల తికమకపడ్డది.

"ఏదో అన్నాడు లెండి."అన్నది చివరకు.

"నాదగ్గరఎందుకు దాస్తావు? పాపం! అయినా నన్ను చూస్తే నీకేంనమ్మకం?"

"అదా నాఉద్దేశ్యం?"

"అయితే ఎందుకుచెప్పవ్?"

"చెప్పుతాను. భోజనంకానివ్వండి!"

"కానిస్తానుచెప్పు."

"నన్ను పొరబాటున మీకిచ్చేశాడుట......ఆయనవల్లు తెలీనిమాటలు మీరు పాటించుకోకండేం ఆయనముఖం చూడవద్దిక."

రంగారావుముఖం గంభీరంగామారింది. కొంచెంసేపతను నిశ్చలంగాకూర్చున్నాడు.

"ఆయనన్నమాటలో అబద్ధంఏమిటి?"

"ఎందుకట్లాఅంటారు? ఆయనకు మరీ వళ్ళు తెలీటంలేదు."

"నాకాయనన్నమాట చాలానిజంగాఉంది సుమా"

"ఆయనతో మీకెందుకు? మీకాయనెక్కువా? నే నెక్కువా?"

"నీకుకూడా ఆఆలోచనతట్టే ఉంటుంది. ఎందుకు దాచిపెడతావు? మీనాన్న అన్నమాట నిజమని నీకు తెలీదూ?"

"నేనా?...నేను ఆమాట నిజమనుకుంటున్నానా? ఈయ నివ్వాళ ఏంముంచుకుపోయిందనిరావాలి?"

"నీకు నిజంగా నన్నుచూస్తే ఇష్టమేనా?"

"ఆమాత్రం గ్రహించలేరూ? నేను మిమ్మల్నిచూచి అసహ్యించుకుంటే ఎవరినిచూచి సహించగలను?"

రంగారావు నిట్టూర్పువిడిచాడు.

"నన్నెంతఏడిపించావు? నన్నుచూస్తే నీకెట్లాఅసహ్యంలేదని అనుకుంటాను? నేను మీనాన్నకన్న ఆయిదేళ్ళుచిన్న."

"ఏంమాటలు! ఊరుకోండి. ఎవరన్నావింటే నవ్వుతారు."

"మరి నన్ను చూస్తే నీకుభయమా? లేకపోతే నాతోఎందుకు స్వేచ్ఛగామాట్లాడవు?"

"నాకు ఒకటేభయం. అతిగా మాట్లాడుతుంటే మీకసహ్యమేమోనని."

"ఆమాటకొస్తే అదీనిజమే! చూడు ఎంతసేపునించీ మాట్లాడుతున్నావో! ఇప్పుడు కాదులే నీపని."

లీల నవ్వుతూ వెనక్కుతిరిగి రెండడుగులువేసింది.

"చూడు"అన్నాడు రంగారావు.

లీల వెనక్కుతిరిగింది.

"ఏమీలేదులే!"అన్నాడు రంగారావు నవ్వుతూ. లీల నవ్వి వెళ్ళిపోయింది.